

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### పప్పు షేములు - ముద్దు పలుకులు

ఇంటికి అమ్మ స్నేహితురాలు ఒకావిడ వస్తే, "అమ్మా.. లావుపాటి పిన్నిగారు అంటే ఈవిడేనా?" అని అడిగే బుడుగుని బాపుగారు ఎప్పుడో కార్టూన్లలో పరిచయం చేసేసారు. పిల్లల వచ్చీ రానిమాటలు ఊరీ ఊరని ఊరగాయముక్కల్లా బహురుచిగా ఉంటాయి. కానీ కొన్నిసార్లు పెద్దాళ్ళని ఇరకాటంలో పడేస్తాయి.

మేం పక్కింటివాళ్ళ చెట్టుమామిడికాయలు వాళ్ళకి తెలియకుండా కోసి రెండు కాయలు మాగాయ పడేస్తే, సంవత్సరమంతా మా పిల్లలు.. "అమ్మా దొంగ మాగాయా? మామూలు మాగాయా?" అని ఇంటికి ఎవరు వచ్చినా వాళ్ళ ముందర అడిగి మా ప్రాణాలు తీస్తూనే ఉన్నారు.

ఎవరైనా ఇంటికి వచ్చినప్పుడు పిల్లల్ని కంట్రోల్ చెయ్యడం అతికష్టమైన విషయం. వచ్చిన వాళ్ళకి టిఫిన్ పెడితే అది కొంచెమే ఉంటే, అప్పటిదాకా దాని మొహం చూడని ఆఖరివాడికి అదే తినాలని తెగ అనిపించి "ఆ ఆంటీ పళ్ళెంలో గారెలే కావాలే..." అని కిందపడి తలమోదుకుని ఏడిచే ప్రమాదం ఉంది.

"చచ్చినాడా... గారెలు తినకపోతే ఇప్పుడు చస్తావా?... అబ్బే. వాడు అలాగే అంటాడు. . మీరు తినండి... తినండి" అని తల్లి వాళ్ళకి నచ్చచెపుతుంటే. ఆ వచ్చినావిడ పరిస్థితి ఏమిటి పాపం?

ఈ మధ్య మా చెల్లెలు తన నాలుగేళ్ళ కొడుకు గురించి చెప్పి తెగ వాపోయింది. ఇంటికి బావ వచ్చి ఏదో షాపింగ్ చేసుకోవాలని, దాని కొడుకుని కూడా పెట్టుకుని వెళ్ళాడట. అక్కడ అతను తన మనవడికి బట్టలు కొంటూ వీడికి ఓ జత కొన్నాడట. వీడికి ఒళ్ళు మండిపోయి, "మీ మనవడికి అన్ని బట్టలూ, నాకు ఒకే ఒక జతా?" అని అడిగాడట. చిన్నపిల్లాడని ఆయన నవ్వుతూ తీసిపారేసాడట. కానీ వీడు ఊరుకోలేకపోయాడుట. అతను బిల్ కడుతుండగా "ఏమిటో ఈ మధ్య నా అండర్ వేర్లూ, నాన్న అండర్ వేర్లూ కూడా అన్నీ చిరిగిపోయాయి..." అన్నాడుట.

"ఈ దరిద్రుడు ఇలా మా పరువు తీసాడక్కా!" అంటూ అది చెప్పి తెగ ఇదయిపోయింది.

ఆ మధ్య నా అమెరికా యాత్రలో భాగంగా నేను చాలా మంది ఇళ్ళకి వెళ్ళి, చాలా మంది పిల్లల్ని చూసాను.

ఇక్కడే పెరిగిన పిల్లలు అసలు దగ్గరకే రాక, నా మాట అర్థం కాక బిగుసుకుపోయారు. కానీ తెలుగు తెలిసిన సిసింద్రీలు వ్యతిరేకంగా నన్ను నంజుకు తిన్నారు.

మా బావ పిల్లలు ఒకత్తి ఐదేళ్ళదీ, రెండోది రెండున్నర ఏళ్ళదీ నన్ను జీవితంలో మొదటిసారి చూసినా, "మేం పెద్దమ్మ దగ్గరే పడుకుంటాం... మేం పెద్దమ్మ పెడితేనే అన్నం తింటాం... పెద్దమ్మే జడలు వెయ్యాలి..." అంటూ నన్ను వదిలి పెట్టలేదు. ఏమాటకామాట పిల్లలు అలా కలుపుగోలుగా ఉండడం మంచిదే! కానీ వాళ్ళకి కథలు చెప్పి, చెప్పి నోరు నొప్పి పెట్టి, చెవులు వాచేటట్లు సాహిత్య సమావేశాల్లో పాలుపంచుకోవడమే మేలన్న నిశ్చయానికొచ్చాను. సాయంత్రానికి ఆ పిల్లలు ప్రేమలో తడిసి అలిసిపోయి జ్వరం వచ్చింది. అసలు నన్ను అడిగితే పిల్లల్ని కనిపెంచే ప్రతి తల్లికీ భారత రత్న ఇచ్చి పారెయ్యాలి!

ఇంకా కొన్ని సార్లు పిల్లలకి చాలా ఇబ్బందికరమైన సరదాలుంటాయి. మా కజిన్ సిస్టర్ డాటర్ ఏడాదిన్నరది. దానికి ఇంటికి వచ్చిన వాళ్ళు బొడ్డు చూపించకపోతే ఏడుస్తుందిట. వాళ్ళ తాతగారు ఏది నేర్పించినా, నేర్వకపోయినా, "అమ్మా, నా బొడ్డేదీ... ఇదిగో... నీదేదీ?" అని అర్జెంటుగా ఆ ఒక్కటి నేర్పేసి అమెరికా తోలేసాడుట. "చస్తున్నాం అక్కా.. దీనితో సిగ్గుగా ఉంది!" అని అది కన్నీరు మున్నీరుగా చెప్పుకుంది. ఇంకొక సిసింద్రీకి వచ్చిన వాళ్ళ జుట్టు పీకడం, మీసాలు పీకడం సరదా కావచ్చు. సదరు తండ్రి నవ్వుతూ "ఫరవాలేదండీ.. పీకించుకోండి... విసుగొస్తే వాడే అవతలకి పోతాడు" అంటే వచ్చినాయనకెలా ఉంటుందీ?

చిన్నతనంలో మా పక్కింట్లో మాధవి అనే చిచ్చరపిడుగుండేది. అదో రోజున "మా అమ్మ లడ్డూలు చేసింది రమణక్కా!" అని చెప్పింది.

మా అన్నయ్య వెంటనే "మా ఇంట్లో ఏం చేసినా తింటావుగా. మీ ఇంట్లోంచి పట్టుకురా!" అన్నాడు. అది ఇంటికి వెళ్ళింది. ఎంతకీ రాలేదు. ఈలోగా ఏదో పనిమీద మా అన్నయ్య వాళ్ళ ఇంటికి వెళితే, అక్కడ ఓ ముసలాయన కూర్చుని వాళ్ళ నాన్నగారితో మాట్లాడుతున్నాడు. మాధవి బయటికొచ్చి చేతులు తిప్పుతూ " ఈ సనత్‌నగర్ తాతగారు వెళ్ళిపోయేదాకా మా అమ్మ లడ్డూలు బయటికి తియ్యనంది.. ఎప్పుడు వెళతారో ఏవిటో?" అంది!

అప్పుడు చూడాలి ఆ సనత్‌నగర్ తాతగారి మొహం!

మా కొలీగ్ ఒక టీచర్ చాలా మొహమాటస్తురాలు. ఆచారం కూడా ఎక్కువ. ఒకసారి వాళ్ళిద్దరు మగపిల్లల్ని తీసుకుని ఇంకో టీచర్ ఇంటికి వెళ్ళింది. ఆ వినోలియా అనే టీచర్ టీ పెట్టి, "పిల్లలు తాగుతారా?" అని అడిగింది. ఈ పిల్లలకి నిజంగానే టీ తాగడం అలవాటు లేదు. 'తాగరు' అని వాళ్ళ అమ్మ చెప్పేలోపునే 'మేం తాగుతాం.. మేం తాగుతాం' అని అరవడం మొదలు పెట్టారు. ఆవిడ నవ్వి తెచ్చి ఇచ్చింది. అది తాగి "మాకు ఇంకా టీ కావాలి.. ఇంకా కావాలి.." అని అరవటం మొదలు పెట్టారు. ఎంతో డిసిప్లిన్‌లో పెరిగే పిల్లలు ఆ నిమిషాన అంత ప్రలోభ పడడం నాకూ ఆశ్చర్యం అనిపించింది.

చైల్డ్ సైకాలజీ తెలుసుకోవడం అనుకున్నంత ఈజీ కాదు. వీరేంద్రనాథ్ గారు ఓ సారి చెప్పారు, వాళ్ళ అమ్మమ్మ ఎవరింటికి తీసుకెళ్ళినా "అక్కడ నువ్వు అల్లరి చెయ్యకూడదు.. కుదురుగా ఉండాలి" అని హెచ్చరించి తీసుకెళ్ళేవారట. అక్కడ ఆయన బుద్ధిగా మాట్లాడకుండా కూర్చునేవారట. మళ్ళీ ఇంకొకరింటికి తీసుకెళ్ళేటప్పుడు కూడా "అక్కడ నువ్వు కుదురుగా, బుద్ధిగా కూర్చోవాలి.. పోయినసారిలా కాదు!" అనేవారుట. దాంతో అసలు కుదురు అంటే అర్థం అయ్యేది కాదుట!

మా కాలంలో మేం పదకొండుగురం కజిన్స్. అందర్నీ మా అమ్మమ్మే పెంచేది. ఇలా అల్లరి చేస్తే, ఇలా వాగితే ఆవిడ పెంచగలిగేదా? అందులోనూ ఆఖరిదాన్ని కాబట్టి నేనే ఎప్పుడైనా కాస్త పెంకితనం, అల్లరీ చేసేదాన్ని! ఎవరైనా ఇంటికి వచ్చినప్పుడు మేం లోపలికి పోకుండా అక్కడే నిలబడితే, మా అమ్మమ్మ వచ్చి మా జబ్బ పట్టుకుని "లోపలికి వెళ్ళమ్మా!" అనేది, మృదువుగా! కానీ జబ్బలో

'కప్పు' పెట్టినట్లు పట్టుకునేది. కళ్ళల్లో నీళ్ళు నిండి లోపలికి పోయేవాళ్ళం. ఎవరైనా ఏదైనా తింటుంటే ముద్దలు లెక్కపెడుతూ అక్కడ నిలబడేవాళ్ళం కాదు!

మా నాన్నగారు ఒకరింట్లో భోజనం చేస్తూ, కందిపచ్చడితో పెద్ద పెద్ద ముద్దలు చేస్తుంటే "అమ్మా.. మాయాబజార్ తాతయ్య... మాయాబజార్ తాతయ్య" అని వాళ్ళ పిల్లాడు చప్పట్లు కొట్టడం నాకు గుర్తు!

ఇంకో రకం పిల్లలుంటారు. మంచాళ్ళే కానీ చిరాగ్గా ఉంటారు. ఒకసారి మా బావగారి కోసం వాళ్ళ స్నేహితుడొచ్చాడు. అప్పటికే తెల్లారి చాలామంది స్నేహితులొచ్చి వెళ్ళినట్లున్నారు. ఆయన పెద్ద పిల్లని చూసి "అమ్మా.. కాసిని మంచి నీళ్ళిస్తావా?" అని ముద్దుగా అడిగాడు.

అది నోట్స్ రాసుకుంటూ చిన్న దానితో.. "ఈసారి నేను ఇవ్వను... నువ్విివ్వవే.." అంది. చిన్నది వెంటనే.. ఛీ.. ఎప్పుడూ నేనే ఇవ్వాలా దరిద్రం! ఛస్తున్నాను.. నువ్వే ఇవ్వు!" అంది.

వచ్చినాయన బిత్తరపోయి చూస్తున్నాడు పెద్దది లేచి "హూ! ఎప్పుడూ నేనే ఇవ్వాలి. ఛీ! ఇదిగో.. తీసుకోండి" అని తెచ్చి ఆయన ముందు పెట్టింది. ఇదంతా నాకు చెపుతూ అక్క ఎప్పుడికైనా వీళ్ళకి బుద్ధులొస్తాయా? అని తెగ విచారించింది. ఇప్పుడు ఒక్కత్తి లాయర్గా, రెండోది అమెరికాలో సాఫ్ట్వేర్ ఇంజినీర్గా పిల్లల్ని పెంచుకుంటూ ఇవన్నీ చెపితే నవ్వుతుంటారు. ముఖ్యంగా అది దాని కొడుకుని పెంచే తీరు నాకు చాలా నచ్చింది. "నిన్ను థింకింగ్ ఛైర్ ఎక్కిస్తాను.. డాడీకి చెపుతాను" అంటే చాలు.. వాడు ఏ అల్లరి చేస్తున్నా ఆపేస్తాడు. కానీ ప్రపంచంలో ఏ ప్రశ్నకయినా తన దగ్గర ఆన్సర్ ఉందని వాడికి గొప్ప నమ్మకం." ఐ విల్ టెల్ యూ. ఇఫ్ యూ హేవ్ డౌట్స్. యూ కెన్ ఆస్క్ మీ" అంటూ పరిగెత్తుకొచ్చేస్తాడు.

కొన్నిసార్లు తల్లిదండ్రులు పిల్లల్ని యమా కన్ఫ్యూజ్ చేసి పారేస్తుంటారు. మా అన్నయ్య ఇంటికి ఎవరొచ్చినా పిల్లాడ్ని పిలిచి ఓ పాట పాడించి, వాళ్ళకొచిన జోక్స్, మిమిక్రీ అన్నీ చెప్పింస్తుండేవాడు. ఇది అలవాటయిన వాళ్ళు ఎవరు ఇంటికొచ్చినా వాళ్ళ ప్రాణం తీసి వాళ్ళకొచ్చిన వన్నీ అప్పచెప్పి వెళ్ళిపోతుండేవారు. వచ్చినవాళ్ళు వినకపోతే కొంపలు మునిగిపోయేవి! వీళ్ళు ఆరున్నరొక్కరాగాలు ప్రారంభం!

మా కెనడా అక్క కూతురు వచ్చీరాని మాటల వయసులో కొంతకాలం వాళ్ళ అమ్మ దగ్గర హైదరాబాదులో ఉండేది. ఆవిడ పొద్దస్తమానం టీ.వీ సీరియల్స్ పెట్టి దానికి అలవాటు చేసింది.

ఒక రోజు అది సీరియస్గా నాతో "పిన్నీ.. ఐ హేవ్ టూ టైటిల్స్ ఫర్ స్టోరీస్. పెళ్ళి చేసుకుందాం... పక్క మీద పూలు జల్లుకుందాం!" అంది. మేం అవాక్కయిపోయాం. ఇండియా వచ్చి అది ఏం నేర్చుకుందయ్యా అంటే, రోజా పూలు కొనమని పేచీలు పెట్టి, భుజం మీద నుండి జారేలా ఓ తువాలు వేసుకుని, పాల గ్లాసు చేతులో పట్టుకుని గదిలోకి వెళ్ళి తలుపేసుకుంటూ ఉండేది. మూడేళ్ళ పిల్ల!

చిన్నప్పుడు నాగ్పూర్ సెలవలకి వెళితే మా పెద్దమ్మ కూతురు ఉన్న నాలుగు మంచాల్లో వచ్చిన పదిమంది గెస్ట్స్ నీ అడ్జస్ట్ చెయ్యడానికి ప్రయత్నిస్తూ, "అమ్మమ్మా, నేనూ, అన్నయ్యా, చెల్లీ ఒక మంచంలో.. మా నాన్నా, పిన్నీ, అత్తయ్యా, బావా ఒక మంచంలో.. అంటూ రకరకాల ఈక్వేషన్స్తో బంధువుల్ని పట్టించడానికి చూసి, పెద్దవాళ్ళు సిగ్గుతో కూకలేస్తే తెగ చిన్నబుచ్చుకుంది. ఆ ఈక్వేషన్స్ తప్పని తెలిసే వయసుకాదుగా!

సిగ్గులేని బాల్యం.. సిగ్గు తెలిసే యవ్వనం.. సిగ్గుపడే మధ్య వయసు... సిగ్గు అక్కరలేని వృద్ధాప్యం.. అందరి జీవితాల్లో వినిపించే చరణాలు!